ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుండి ఫామిలీ ప్లానింగ్ పుస్తకాలతో పాటు అందుకు సంబంధించిన సరంజామాతో వచ్చిన కుటుంబరావుని చూసి మంజుల ఆశ్చర్యపోయింది.

"ఏమిటండి అవి?" అంది అతనికి కాఫీ ఇస్తూ.

"ఏమిటో తెలియటం లేదు?" అన్నాడు కుటుంబరావు కాఫీ అందుకొంటూ.


"తెలుసు. ఇంతవరకు పిల్లలే లేరే. ఇప్పుడు మన కెందుకని-" అడిగింది మంజుల అర్థంకాక

"మన కెందుకేమిటే పిచ్చిమొఖమా! ఎవరికోసమో అయితే ఎందుకు తెస్తాను? మన కోసమే"

"అంటె" అంది మంజుల విషయ మేమిటో కొంతవరకు అర్థమౌతుండగా.

"అంటే. ఈరోజునుండి మనిద్దరము కుటుంబ నియంత్రణని అమలులోకి తీసుకు రావాలి." అన్నాడు

ఇన్నాళ్ళ నుండి లేనిది అమాంతంగా



కుటుంబరావు ఈనిర్ణయానికెందుకొచ్చాడో మంజులకి అంతు పట్టలేదు. అదే అతన్నడిగింది.

"ప్రత్యేక కారణమంటూ ఏమీలేదు మంజూ. అందరూ చేస్తున్నదే మనము చేద్దామంటాను. నీకు తెల్సునుగా, మన దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఈ జనాభా పెరగటమనేది అతి ఘోరమైన సమస్యని. ఇది దేశానికే కాక రేపు మన భవిష్యత్తులో కూడ అనేక సమస్యలను సృష్టించవచ్చు. కాస్త ఆలోచించగల పరిజ్ఞానమున్న ప్రతివాళ్ళు నేడీ కుటుంబనియంత్రణ అవశ్యకతను గురించి అమలులో పెడుతున్నారన్న సంగతి కూడ మనందరికి బాగా తెలుసు. నీవు చదువుకొన్నావు. అర్థం చేసుకోగల పరిజ్ఞానముంది. కనుక ముందు జాగ్రత్తగా ఈరోజునుండే మనము కుటుంబనియంత్రణ పాటించాలి." అన్నాడు కుటుంబరావు ఉపన్యాస ధోరణిలో.

అసలిక్కడ ముఖ్యమైన కారణం వేరే ఉంది. అది కుటుంబరావు చెప్పటంలేదు. ఈ మధ్యనే అతనికొక భయం పట్టుకొంది. అదేమిటంటే, తల్లిదండ్రి పెట్టిన 'కుటుంబరావు' అన్న పేరుని తనెక్కడ సార్థకం చేశేస్తాడోనని

కుటుంబరావు చెప్పిన దానికిమంజుల ఏమీ మాట్లాడలేదు

"ఏమిటి డియర్, మాట్లాడవు ఒప్పుకొన్నట్లేగా–"

"..... ..... ..... ....."


"గుడ్ .... అలాగైతే ఈరోజునుండే ఆ పుస్తకాలని బాగా చదివి, అందులో వున్నవేమిటో బాగా వంటబట్టించుకోవాలి–" అన్నాడు ఉత్సాహంగా.

ఆరోజు రాత్రి భోజనాలు పూర్తి చేసి, అన్నీ సర్దుకొన్న తరువాతమంజుల వచ్చి మొగుని ప్రక్కలో కూర్చుంటుండగా కుటుంబరావు ఒక పిడుగు లాంటి వార్త పేల్చేడు. అదేమిటంటే 'బ్రహ్మచర్యం' ఇది కుటుంబ నియంత్రణ అనబడే దానిలో ఒక భాగమేమో.

కాపురానికొచ్చి ముచ్చటగా మూడు నెల్లు కూడా కాలేదు. అప్పుడే ఈ దురవస్థ ఏమిటాని ఎంత ఆలోచించినా ఆమెకి అర్థంకాలేదు. ఆ సమయంలో ఆమెకి 'కుటుంబనియంత్రణ' అంటూ ఒకదాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వంమీద విపరీతమైన కోపం వచ్చింది. ఒక విధంగా ఆలోచిస్తే తన దుస్థితికి అది ఒకకారణం కాదనిపించింది. ఇద్దరూ లేక ముగ్గురు తరువాత కుటుంబనియంత్రణ అన్నది. కాని అసలేమి లేకుండానే కుటుంబనియంత్రణ అనలేదుగా! అయినా కుటుంబనియంత్రణకావాలంటే ఇంకెన్ని మార్గాలు లేవూ? ఏ గోడమీద చూసినా, ఏ సినిమా కెళ్ళినా అదే గోల కదా! అంతేకాదు అవేమిటో చెప్తూ రేడియో పెట్టంగానే విన్పించేవి అవే; మరి ఇది ఈయన పిచ్చి అనాలా లేక తెలివితక్కువ అనాలా అనుకొంది బాధగా

ఒకసారి మొగుడు పడుకొన్న మంచంవైపు చూసింది. అప్పటికే అతను గుర్రుపెట్టి నిదురపోతున్నాడు.

మంజుల ఒక్కసారి నిట్టూర్చింది. రోజూ ఈ టైముకి తను మొగుడిప్రక్క



లో చేరి ఇద్దరూ ఎన్ని కబుర్లు చెప్పుకొంటూ పడుకొనేవారు.

ఆ తరువాత వరుసనే నాలుగు రాత్రులు ఈ విధంగా జరిగింది. మొగుడు తన పద్ధతి మార్చుకొంటాడేమోనని మంజుల రోజూ ఎంతో ఆశతో ఎదురు చూసింది. అంతే కాదు కావాలని అతనికి దగ్గరవటానికి ఎన్నో సార్లు ప్రయత్నించింది కూడ. కాని, కుటుంబరావు ఈ విషయంలో చాలా సిన్సియరుగా ఉన్నాడు. పాపం ! ఒకొక్కసారి నిదురపట్టక బయటి వరండాలో ముసుగు కప్పుకొని పడుకొనేవాడు, ఎముకలు కొరికే ఈ చలిరోజుల్లో కూడ, ఏ మాత్రం సడలింపని తన భర్త దీక్షకి మంజుల అబ్బురపడింది. ఆడదై వుండికూడ తనమాత్రం భర్తతో సహకరించలేక పోతున్నందుకు సిగ్గుపడింది కూడ. భర్త ఎడబాటు బాధగా వుంది పరిష్కారం ఆలోచించింది.

మామూలుగా ఆ రోజు సాయంత్రం కుటుంబరావు ఆఫీసునుండి వచ్చిన వెంటనే "మీకీ రోజున ఒక శుభవార్త చెప్పబోతున్నాను" అంది మంజుల ఆనందంగా.

'ఏమిటది ' అన్నాడు ఆదుర్దాగా.

'మీరు తండ్రి కాబోతున్నారు.' అంది మంజుల సిగ్గుతో తలొంచుకొంటూ.

కుటుంబరావు నెత్తిన పిడుగుపడినట్లయింది. 'ఇదెలా సాధ్యం!' అన్నాడు ఇంకేమనాలో తెలియక.

'సాధ్యమేమిటండి బాబు, సాధ్యం! మీ కుటుంబనియంత్రణ అమలులోకి వచ్చి ఇప్పటికి నాలుగురోజులేగా—? అంతకుముందు లేదుగా' అంది మంజుల కొంటెగా చూస్తూ.

'అవును నిజమే అన్నాడు' కుటుంబరావు నీరసపడిపోతూ పాపం! అతనా సమయంలో తన ప్లానంతా పాడైనందుకు కృంగిపోయాడుకూడ కాని, ఏం చెయ్యగలడు ? అంతా భగవంతుని లీల అని సరిపెట్టుకోటానికి ప్రయత్నించాడు.

ఆ రోజు రాత్రి కుటుంబరావు ఏదో ఆలోచిస్తూ పడగ్గదిలో పడుకొనుండగా 'మల్లెపందిరి నీడలోన జాబిల్లి, మంచమేసి వుంచినాను జాబిల్లీ' అంటూ పాడుకొంటూ వచ్చిన

మంజులని చూసి ఆమె మీద నుండి కళ్ళు తిప్పుకోలేక పోయాడు. రోజూ అదే అలంకరణ అయినా ఈ రోజు ఆమె అలంకరణలో అతఃకొక ప్రత్యేకత కన్పిస్తుంది. అది తన దృష్టి లోపమో, లేక తనుచూసే విధానంలో వచ్చిన మార్పో అతనికి తెలియలేదు.

అంతలోనే మంజుల వచ్చి అతని ప్రక్కన కూర్చొంది వెంటనే కుటుంబ రావుకి తన కుటుంబనియంత్రణ సంగతి గుర్తొచ్చి, ఆమెకి దూరంగా జరగ బోయాడు.

"ఇంకా, ఏం కుటుంబ నియంత్రణ సార్! మీరెంత దీక్ష వహించి, ఎన్ని చిట్కాలు ఉపయోగించినా, మనకి పాపాయి పుట్టట మన్నది ఖాయమన్న సంగతి మర్చిపోకండి." అంది మంజుల అతని వళ్లో వ్రాలుతూ.

కుటుంబరావుకి సాయంత్రం మంజుల చెప్పిన విషయం గుర్తొచ్చింది. ఎలాగో పాపాయి పుట్టడం ఖా య ం. కనుక వెంటనే తన దీక్షకి స్వస్తి చెప్పి, ఈ పాపాయి పుట్టే వరకు దాన్ని పోస్టు పోన్ చేయలను కొన్నాడు.

రెండు నెలల అనంతరం ఒకనాటి రాత్రి మొగుడితో మంజుల, "ఈరోజు మీకొక విషయం చెప్పాలను కొంటున్నా నండి" అంది అతని జుట్టులోకి వ్రేళ్ళు పోనిస్తూ.

"నేనూ ఈరోజు నిన్నొక విషయం అడగాలను కొంటున్నాను మంజూ." అన్నాడు కుటుంబరావు.

"అలాగై తే ముందు మీరడగండి, తరువాత నేను చెప్పేది చెప్తాను" అంది మంజుల.

"అదికాదు మంజూ. ఇంకా మూడు నాలు నెలల్లో పాపాయిపుట్టి తల్లి కావల్సినదానివి. కాని, నీలో ఆ లక్షణాలేవి కన్పించటం లేదేం?" అన్నాడుకుటుంబ రావు ఎన్నాళ్ళనుంచో పట్టి పీడిస్తున్న అనుమానాన్ని బయటపెడూ.

"నేనేదై తే చెప్పాలనుకొంటున్నానో అదే మీరడిగారు. మీరు అడుగుతున్న ఆ లక్షణాలవి ఈరోజునుండి కన్పిస్తాయి" అంది మంజుల చిలిపిగా నవ్వుతూ.

"అంటే?" అర్థంకాక అడిగాడు కుటుంబరావు.

"అంటే, అప్పుడు నేను చెప్పింది అబద్ధం. ఇప్పుడు చెప్తున్నది నిజం."

కుటుంబరావు గట్టిగా ఒక్కకేకపెట్టి మంచంమీదనుండి జారి క్రిందపడాడు.

పావం! తను ఇంత ఘోరంగా మోసపోతాడని కల్లో కూడ ఊహించ లేదు.

●